క్లుప్తంగా

నులి పురుగుల నివారణకు కృషి



కొడకండ్ల: 1 నుంచి 19 ఏళ్ల వయస్సు పిల్లల్లో నులిపురుగుల నివారణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్దేశిత వయస్సు కలిగిన పిల్లలందరికి నులిపురుగుల నివారణ మందులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హరికృష్ణ, సీహెచ్‌ఓ దయాకర్, పాఠశాలల హెచ్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి



బచ్చన్నపేట: ఆరోగ్య సమస్యలు ఉన్న వారు తప్పకుండా వైద్య పరీక్షలు చేసుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి ల్యాబ్ టెక్నీషియన్లు మానస, సౌమ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో లేబర్ కార్డు కలిగి ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదరికంలో ఉన్న వారు లేబర్ కార్డులను తీసుకోవాలని అన్నారు. లేబర్‌కార్డు ఉంటే ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అరూరి వెంకటమ్మకు పలువురి నివాళి



జఫర్‌గఢ్: వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీజేపీ సీనియర్ నాయకుడు అరూరి రమేశ్ తల్లి వెంకటమ్మ ఉప్పుగల్లులో సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, మంగళవారం నిర్వహించిన వెంకటమ్మ అంత్యక్రియల్లో వివిధ పార్టీల నాయకులు పాల్గొని వెంకటమ్మకు నివాళులర్పించి రమేశ్‌ను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మంద కృష్ణ మాదిగ, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, అజ్మీరా సీతారాంనాయక్, మార్తినేని ధర్మారావు, ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కొండేటి శ్రీధర్, నాగుర్ల వెంకన్న, రాకేష్‌రెడ్డి, తీగల కర్ణాకర్‌రావు, అన్నెబోయిన భిక్షపతి, వెంకటేశ్వర్‌రెడ్డి, మహేందర్‌నాథ్, సుమన్, పీఆర్‌కేరెడ్డి ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



జనగామ రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ కార్మికులకు, కర్షకులకు, ప్రజలకు వ్యతిరేకంగా సంపన్న వర్గాలకు మేలు చేసే విధంగా ఉందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంచు విజేందర్ విమర్శించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ పార్క్ సెంటర్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు, బూడిద ప్రశాంత్ గంగరబోయిన మల్లేష్ రాజ్, కళ్యాణం లింగం, వెంకటేష్, గాడి శివ, చిదిరాల ఉపేందర్, బూడిద నవీన్ పాల్గొన్నారు.

'శ్రమజీవులను విస్మరించిన కేంద్రం'

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను సవరించి శ్రమ జీవుల సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి సోమయ్య డిమాండ్ చేశారు. బడ్జెట్ కేటాయింపుల్లో శ్రమజీవులను విస్మరించడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. పార్టీ మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు ఎండీ షబానా, నాయకులు సుధాకర్, ఎక్బాల్, సమ్మయ్య, నర్సింగం, శోభ, నారాయణ పాల్గొన్నారు.

నిధుల్లో కొరత విధించడం సరికాదు

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మహిళా సంక్షేమానికి కేటాయించే నిధుల్లో కొరత విధించడం సరికాదని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎండీ షబానా పేర్కొన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆమె మహిళలతో కలిసి నిరసన తెలిపారు. యాదమ్మ, రజిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లోకి గోదావరి జలాలు

- యాసంగిపై రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- ఫలించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి కృషి



మండల కేంద్రంలోని పాత చెరువులో గోదావరి జలాలు



చెరువులోకి వస్తున్న గోదావరి జలాలు

లింగాలఘణపురం: మండలంలోని పలు గ్రామాల చెరువులు, కుంటలకు 15 రోజులుగా గోదావరి జలాలు చేరుతున్నాయి. రఘునాథపల్లి మండలంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్ కుడి కాల్వ నుంచి ఎన్నో ఏళ్ల క్రితం రావాల్సిన నీళ్లు ఎట్టకేలకు వస్తున్నాయి. గత ఎన్నికల్లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి యాసంగిలో చెరువులు నింపుతానని ఇచ్చిన హామీ మేరకు మండల కేంద్రంలోని పాత చెరువులోకి గోదావరి జలాలు చేరుతున్నాయి. తీవ్రమైన కరువు నేపథ్యంలో ఐదేళ్ల క్రితం జనగామ పట్టణంలోని వరద నీరును గ్రామస్తులంతా ఏకమై నానా ఇబ్బందులు పడి కాల్వలతో మండల కేంద్రంలోని చెరువును నింపుకుని అప్పట్లో మత్తడి పోయించడం జరిగింది. అప్పటి నుంచి గోదావరి జలాలతో చెరువులు నింపుతామని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధులు ఏ ఒక్కరూ హామీని నెరవేర్చలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రీహరి కాల్వల్లో కూరుకుపోయిన మట్టిని తొలగించేందుకు అధికారులతో చర్చించి మట్టిని తీసి ప్రధాన కాల్వను పూర్తి చేయించారు. దీంతో గత నెలలో అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి నీళ్లు వదిలి మండలంలోని నెల్లుట్ల ఎర్రకుంట, మండల కేంద్రంలో పాత చెరువు, కళ్లెంలోని చింతల చెరువు, మల్లికుంట, నాగారంలోని దామెర చెరువు, దేవుని చెరువుల్లోనికి, బండ్లగూడెం కొత్త చెరువులోనికి గోదావరి జలాలు చేరుతున్నాయి. అదేవిధంగా పటేల్‌గూడెం, నవాబుపేట, సిరిపురం, జీడికల్ చెరువుల్లోనికి నీరు చేరేందుకు పిల్ల కాల్వల మరమత్తుతో పాటు అక్కడక్కడా మిగిలిపోయిన భూసేకరణ పనులను కూడా పూర్తి చేస్తున్నారు. త్వరలో ఆ చెరువుల్లోకి కూడా గోదావరి జలాలు చేరనున్నాయి. ఇకపోతే ఇప్పటికే ఆలేరు నియోజకవర్గంలోని టంగుటూరు చెరువు నిండి శారాజీపేట చెరువులోనికి కూడా నీరు చేరుతుంది. యాసంగిలో పంటలు ఎండిపోతాయనే దిగులుతో ఉన్న రైతుల ఆశలు నేడు చిగురిస్తున్నాయి.

నిండే వరకు నీళ్లు వదలాలి..



పదిహేను రోజులుగా గోదావరి జలాలు కుంటలు, చెరువుల్లోనికి వస్తున్నాయి. ఎంతో సంతోషంగా ఉన్నాం. ఏదో నామమాత్రం కాకుండా చెరువులు నిండే వరకు నీళ్లు వదలాలి. యాసంగి పంటపై ఎంతో ఆశలు పెట్టుకున్నాం.

– జిల్లెల వెంకట్‌రెడ్డి, రైతు, కళ్లెం

సంతోషంగా ఉంది..



చెరువులోనికి గోదావరి నీళ్లు రావడం సంతోషంగా ఉంది. మత్తడి పోసే వరకు నీళ్లు వదలాలి. పదిహేను రోజులుగా వస్తున్న నీళ్లతో చెరువులో నీళ్లు కలకలలాడుతుంది. యాసంగి పంటలు పండుతాయనే నమ్మకం కలుగుతుంది.

– గట్టగల్ల మైసయ్య, రైతు, లింగాలఘణపురం

'మాజీ సర్పంచ్‌ల అరెస్టు అప్రజాస్వామికం'



దేవరుప్పుల: పోలీస్‌స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు



తరిగొప్పులలో..

దేవరుప్పుల: గత ప్రభుత్వ హయాంలో గ్రామాల అభివృద్ధికి పాటుపడిన మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లుల కోసం న్యాయపోరాటం చేసేందుకు సిద్ధమవుతున్న వారిని ముందస్తు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ విమర్శించారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాలకు మాజీ సర్పంచ్‌ల ఆందోళన నేపథ్యంలో వారిని స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు అరెస్టు చేసిన మాజీ సర్పంచ్‌లకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల కోసం తలపెట్టిన కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మాజీ సర్పంచ్‌లు బానోత్ గేమా నాయక్, బానోత్ రాజన్న, వంగ అర్జున్, బండి నర్సింహులు, వర్రె మధు, గోపాలుదాసు మల్లేష్ ఉండగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి చింత రవి, జోగు సోమనర్సయ్య సంఘీభావం తెలిపారు.

తరిగొప్పుల: పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి బయలుదేరని మాజీ సర్పంచులను అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మాజీ ఎంపీపీ నూకల కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని పలు గ్రామాల సర్పంచులను ఎస్సై గుగులోత్ శ్రీదేవి మంగళవారం ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దామెర ప్రభుదాస్, బెల్లపు రాజు, ముక్కెర బుచ్చిరాజ్ యాదవ్, సబావత్ రాజు, రవి ఉన్నారు.

బచ్చన్నపేట: పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మండలంలోని మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమానికి వారు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. మాజీ సర్పంచ్‌లు మల్లారెడ్డి, స్వామి, బాల్‌రెడ్డి, రాజు, ఆజామ్, తదితరులు ఉన్నారు.

ఇళ్లు దగ్ధమైన బాధితులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కనకారెడ్డి

- సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఇళ్లు దగ్ధమైన బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. గ్రామంలో సోమవారం ప్రమాదవశాత్తు ఇళ్లు కాలిపోయి సర్వం కోల్పోయిన తొడెంగల కృష్ణమూర్తి, మల్లయ్య, ఐలయ్య కుటుంబాలను సీపీఎం గ్రామ కమిటీ నాయకులతో కలిసి ఆయన మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అగ్ని ప్రమాదంలో మూడు కుటుంబాలు సర్వం కోల్పోయి రోడ్డున పడ్డాయన్నారు. ప్రమాదంలో ఇళ్లతో పాటు వస్తువులు, డబ్బులు, విలువైన పత్రాలు దగ్ధమయ్యాయని, ఒక్కొక్క కుటుంబానికి రూ.20 లక్షల వరకు నష్టం జరిగిందన్నారు. సీపీఎం నాయకులు రాపర్తి రాజు, మునిగెల రమేష్, కొడెపాక యాకయ్య, మంద మహేందర్, కుర్ర ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం



దేవరుప్పల: మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



నర్మెటలో..



రఘునాథపల్లిలో..

సాక్షి నెట్‌వర్క్: పేదల అభ్యున్నతే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని బీజేపీ నాయకులు అన్నారు. కేంద్ర బడ్జెట్ అన్నివరాల్ల ప్రజలకు లబ్ధిచేకూరేలా ఉందని హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పలు మండల కేంద్రాల్లో బీజేపీ శ్రేణులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 12 లక్షల ఆదాయం వారికి పన్ను మినహాయింపుతో ఊరట కలిగిస్తుందని అన్నారు. విద్యా వైద్యం, పారిశ్రామిక, పట్టణ, గ్రామీణ రంగాల అభివృద్ధికి, యువతకు ఉద్యోగ ఉపాధికల్పనకు బడ్జెట్ కేటాయింపులో సముచిత స్థానం కలిగించారన్నారు.

వైభవంగా అష్టదళ పాద పద్మారాధన పూజ



చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం అష్టదళ పాద పద్మారాధన పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు–కిరణ్మయి, గుళ్లపల్లి శ్రీనివాస్–భవాని, సంగోజు మోహన్–శంకర్ లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో భక్తుల సమక్షంలో 108 బంగారు పుష్పాలు, వెండి పాదపద్మంతో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులుస్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ కుర్రెంల మోహన్, వీరన్న, మల్లికార్జున్, లక్ష్మి, వసంత, గాదె శేఖర్, స్వరూప, మహేష్ పాల్గొన్నారు. కాగా, ఈనెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు. కొబ్బరికాయులు, పూజా సామగ్రి, గండదీపం వద్ద నూనె, కొబ్బరి ముక్కలు ప్రోగు చేసుకునేహక్కు, తలనీలాలలకు సీల్డు టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు చెప్పారు.

రథసప్తమి వేడుకలు

జనగామ రూరల్: బతుకమ్మ కుంట విజయ దుర్గాదేవి ఆలయంలో రథసప్తమి సందర్భంగా ప్రధాన అర్చకుడు ములుగు రాజలింగారాధ్య ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ఉపవాస దీక్షతో సూర్యనారాయణమూర్తిని పూజించారు.

'ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలి'

కొడకండ్ల: కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం బాధ్యతాయుతమైన పదవుల్లో ఉంటూ స్వలాభం కోసం అసంబద్ధమైన రీతిలో మాట్లాడుతున్నారని, రాజకీయ లబ్ధి, ఓటు బ్యాంకు రాజకీయాలు మానుకోవాలని ఓసీ సంక్షేమ సంఘం నాయకుడు పుస్కూరి సోమేశ్వర్‌రావు హితవు పలికారు. బుధవారం ఆయనిక్కడ విలేకరులతో మాట్లాడారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు జాతీయ స్థాయిలో సర్వేక్షణ జరిగిన తర్వాతే రాజ్యాంగ శాసనాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఆర్థిక, సామాజిక అంశాల ఆధారంగానే రిజర్వేషన్లు కొనసాగించాలనే ప్రధాన ఎజెండాతో తాము ఉద్యమించామని, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై కొందరు అర్థం లేని విమర్శలు చేయడం తగదని ఆయన అన్నారు.

విరాళం



స్టేషన్‌ఘన్‌పూర్: మండల కేంద్రంలోని తిరుమలనాథస్వామి దేవాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఆంజనేయస్వామి ఆలయానికి మాజీ వార్డు సభ్యుడు గట్టు వాణి, వెంకటస్వామి దంపతులు రూ.5,116, స్థానికులు రావుల చంద్రకళ, ఉపేందర్ రూ.5,116 విరాళం అర్చకులు కలకోట రామానుజచార్యులుకు మంగళవారం అందజేశారు. భక్తులు తెల్లాకుల రామకృష్ణ, దివాకర్, రాహుల్, కుంభం నరేందర్, మధు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



కొడకండ్ల: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడుతాయని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ కళాశాలలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో యూత్ అసోసియేషన్ సభ్యుడు కాకర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. రెండు రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి

నర్మెట: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణానికి రూ. 1.45 కోట్లు మంజూరు కావడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి దనసరి సీతక్కకు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డికి, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కృష్ణ, రాజు, శ్రీధర్, భిక్షపతి, బాల్ సింగ్, భిక్షపతి పాల్గొన్నారు.

'మౌలిక వసతులు కల్పించాలి'

బచ్చన్నపేట: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు యాజమాన్యాలు మౌలిక వసతులు కల్పించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి దండుగుల మురళీకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిరసన తెలిపిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. బస్సులకు ఫిట్ నెస్ లేదని, అర్హులైన డ్రైవర్లు కూడా పనిచేయడం లేదన్నారు. ఈ విషయమై అధికారులు దృష్టిసారించి చర్య తీసుకోవాలని కోరారు. అఖిల్, శ్రీధర్, సూర్య, లక్ష్మణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరుకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముదిగొండ పరశురాములు తల్లి సోమక్క మంగళవారం మృతి చెందింది. కాగా, కాంగ్రెస్ నాయకులు గ్రామానికి చేరుకొని సోమక్క మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. నర్సింహులు, గణేశ్, నాగరాజు, రసూల్, అనిల్, ఉమేశ్, రవి, నిఖిల్, కిరణ్ తదితరులు ఉన్నారు.

నిధులు కేటాయించాలి

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో ప్రెస్ క్లబ్‌కు స్థలం కేటాయించడంతోపాటు శాశ్వత భవనానికి నిధులు కేటాయించాలని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గూడూరు లెనిన్ ఎమ్మెల్యే యశ్వనిరెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సహకరించాలి

- ఎంపీడీఓ విజయశ్రీ



స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు నిబంధనల మేరకు వ్యవహరిస్తూ ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలని ఎంపీడీఓ విజయశ్రీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో మంగళవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ త్వరలో ఎంపీటీసీ, సర్పంచ్‌ల ఎన్నికలు జరుగనున్నాయని, అందుకు సంబంధించిన కసరత్తులు అధికారులు చేపడుతున్నారన్నారు. కార్యక్రమంలో జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, జీడి రమేష్, మాచర్ల గణేష్, పెరుమాండ్ల వెంకటేశ్వర్లు, కె.శరత్‌కుమార్, సట్ల రమణ, రడపాక ప్రదీప్, గాదె పృథ్వీ పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపాలి

బచ్చన్నపేట: ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ మల్లికార్జున్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో పలు పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మహా ప్రదర్శనను జయప్రదం చేయాలి



పాలకుర్తి టౌన్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్: తాటికొండ ర్యాలీలో మాజీ జెడ్పీటీసీ రవి తదితరులు

పాలకుర్తి టౌన్/రఘునాథపల్లి/జఫర్‌గఢ్/స్టేషన్ ఘన్‌పూర్: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు–లక్షల డప్పులు మహా ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు పలు మండల కేంద్రాల్లో మహాప్రదర్శన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ర్యాలీ నిర్వహించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చెరిపెల్లి యాదగిరిస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు రడపాక ఆదారం, జలగం నరేష్‌మాదిగ, దండు రామచందర్, మాజీ జెడ్పీటీసీ మారపాక రవి, చాడ ఏలియా, ప్రభాకర్, ఎంఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్,రవి, ఎల్లయ్య పాల్గొన్నారు.

మదర్సా విద్యతో ఆధ్యాత్మిక జ్ఞానం



పాలకుర్తి టౌన్: మదర్సాలో విద్యతో ముస్లిం పిల్లలకు ఆధ్మాత్మికత లభిస్తుందని నాజీం మదర్సా యిందాదుల్ అధ్యక్షుడు హజ్రత్ మౌలానా అబిదుర్ రెహమాన్ అతహర్ అన్నారు. మండలకేంద్రంలోని జామామసీద్‌లో మదర్సా వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉర్దూ, అరబిక్ భాషలను నేర్పడంలో మదర్సాలు ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ముఫ్తి యిస్రార్ సాహెబ్ ఖాస్మీ, అతీఖుర్ రెహమాన్ సాహెబ్ అసది, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి'



ఇన్‌చార్జ్‌లకు పత్రాలు అందజేస్తున్న రమణారెడ్డి

బచ్చన్నపేట: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం బచ్చన్నపేట పట్టణ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లుగా తాళ్ల సురేష్‌రెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, తుంగ సతీష్‌లను నియమించి నియామక పత్రాలను అందించారు.

గులాబీ జెండా ఎగరాలి

జనగామ రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలని క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి ప్రేమలత రెడ్డి, వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్లు మారబోయిన పాండు, ఎండీ సమద్, పట్టణ యూత్ అధ్యక్షుడు ఉల్లెంగుల సందీప్ అన్నారు. మంగళవారం చీటకోడూరు, చౌడారం, మరిగడి గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో వారు సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసి మాట్లాడారు. కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

అపస్మారకస్థితిలో ఉన్న మహిళను ఆస్పత్రికి తరలింపు



వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్సై

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామంలో రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని మహిళను స్థానిక పోలీసులు ఘన్‌పూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించిన సంఘటన మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. నాలుగైదు రోజులుగా గుర్తు తెలియని మహిళ ఛాగల్లులో వీధుల వెంట తిరుగుతోంది. ఈ క్రమంలో మంగళవారం రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో ఆమె పడి ఉన్న విషయాన్ని గమనించిన స్థానికులు..పోలీసులు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. సీఐ జి.వేణు, ఎస్సై వినయ్‌కుమార్ ఆస్పత్రిలో ఆమెతో మాట్లాడారు. అయితే సదరు మహిళ నీరసంగా ఉండటంతో పాటు సరైన మతిస్థిమితం లేక వివరాలు చెప్పలేకపోతుంది. తన పేరు అమీర్‌బీ అని, హైదరాబాద్ జూబ్లీహిల్స్ అని చెబుతోంది. దాంతో ఆమె కోలుకునే వరకు వైద్యం అందించి అడ్రస్ తెలుసుకుంటామని, లేనిపక్షంలో సమీపంలోని వృద్ధాశ్రమానికి తరలిస్తామని పోలీసులు తెలిపారు.

మనస్తాపంతో వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న ఆగమ్మ

పాలకుర్తి టౌన్: వ్యవసాయ భూమి అమ్మకుండా కోడలు అడ్డు పడుతుందనే మనస్తాపంతో గిరిజన వృద్ధురాలు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరుప్పుల మండలం దుబ్బతండా గ్రామానికి చెందిన లకావత్ ఆగమ్మకు పాలకుర్తి మండలం మైలారం గ్రామ శివారులో 9 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆగమ్మ భర్త నర్సింహ నాయక్, కుమారుడు బాలాజీ కొన్నేళ్ల క్రితం మృతి చెందారు. 9 ఎకరాల భూమిలో 6 ఎకరాలు కోడలు అనురాధ పేరు మీద పట్టా చేయించింది. వృద్ధురాలు ఆగమ్మ తన పేరిట మూడు ఎకరాలు భూమి ఉంచుకుంది. 2020లో భర్త నర్సింహ కరోనా బారిన పడి ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆ సమయంలో అప్పులు చేసిన ఆస్పత్రి బిల్లులు చెల్లించారు. అప్పుల పెరగడంతో వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలతో తన పేరిట ఉన్న భూమిని ఇటీవల హైదరాబాద్‌కు చెందిన బాచుపల్లి శ్రీధర్‌కు విక్రయించింది. అతని వద్ద రూ. 30 లక్షలు బయానగా తీసుకుంది. భూమి తనకు ఇవ్వకుండా అమ్మకానికి పెట్టడాన్ని జీర్ణించుకోలేని కోడలు అనురాధ వృద్ధురాలితో పలుమార్లు గొడవకు దిగింది. పెద్దమనుషుల సమక్షంలో పంచాయతీ పెట్టినప్పటికీ కోడలు వినలేదు. ఇటీవల కోర్టుకు వెళ్లి భూమి విక్రయింపొద్దని నోటీసు పంపించింది. మరో పక్క ఆర్డీఓకు ఫిర్యాదు చేయగా రిజిస్ట్రేషన్ కాకుండా నిలిచిపోయింది. బయాన ఇచ్చిన వారు రూ.30 లక్షలు చెల్లించాలని ఆగమ్మను అడిగారు. ఆ విషయంపై రెండు నెలల క్రితం పాలకుర్తి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి పెద్ద మనుషుల మధ్య మాట్లాడుకుంటామని చెప్పారు. కాగా, రెండు రోజుల క్రితం పెద్ద మనుషులు మరోసారి కూర్చొని భూమి కొనుగోలుదారులతో మాట్లాడారు. మనస్తాపం చెందిన ఆగమ్మ న్యాయం జరగలేదని పాలకుర్తికి వచ్చి పురుగుల మందు తాగి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన బెంచీపై కూర్చొని స్పృహ తప్పిపడిపోయింది. వెంటనే పోలీసులు పాలకుర్తిలో ప్రథమ చికిత్స చేయించి వరంగల్ ఎంజీఎంకు తరలించారు.